ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU
బుధవారం 22 మే 2024

మీనంబాక్కంలోనే ఆ నలుగురు!

7 గంటలపాటు ప్రయాణికులతో గడిపిన ఉగ్రవాదులు

ఉలిక్కిపడిన చెన్నై విమానాశ్రయ సిబ్బంది

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నుంచి ఐసీస్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులు ఆదివారం ఉదయం 11 గంటలకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగి ఏడు గంటలపాటు అక్కడే గడిపారంటూ దర్యాప్తులో తేలడంతో భద్రతాధికారులు ఉలిక్కిపడ్డారు. విమానాశ్రయంలోని ప్రయాణికుల గుంపులోనే ఆ నలుగురూ అటూ ఇటూ సంచరిస్తూ సాయత్రం ఆరుగంటల వరకు గడిపారు. ఆ తర్వాత సాయంత్రం ఆరు గంటలకు అహ్మదాబాద్‌కు వెళ్లే విమానంలో గుజరాత్‌కు పయనమయ్యారు. ఈ సమాచారం అందటంతో గుజరాత్ పోలీసులు ఆ నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేశారు. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతాదళం అధికారులు, పోలీసులు గనుక అప్రమత్తంగా వ్యవహరించి ఉంటే ఆ నలుగురినీ నిర్బంధించి ఉండవచ్చు. ఏడు గంటలపాటు విమానాశ్రయంలోనే గడిపిన నలుగురు ఉగ్రవాదులను భద్రతాదళం అధికారులు గమనించకపోవడం అక్కడి భద్రతా లోపమేనని చెబుతున్నారు. ప్రస్తుతం నలుగురు ఉగ్రవాదులు పట్టుకోవడంలో విమానాశ్రయ భద్రతాసిబ్బంది వైఫల్యంపై ఉన్నతాధికారులు ఆరాతీస్తున్నారు. అదే సమయంలో అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రత ఏర్పాట్లలో లోపాలను కూడా చక్కదిద్దటానికి చర్యలు చేపట్టనున్నారు.



గుజరాత్‌లో అరెస్టయిన ఉగ్రవాదులు

కొత్త రకం కరోనా వైరస్‌పై ఆందోళన వద్దు

● ఆరోగ్యశాఖ



పెరంబూర్, మే 21: సింగపూర్‌లో తాజాగా వ్యాపిస్తున్న కొత్త రకం కరోనా వైరస్, రాష్ట్రంలో ఇదివరకే వ్యాపించిన జేఎన్1 రకం వైరస్ రూపాంతరమేనని, అందువల్ల కొత్త రకం వైరస్‌తో భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో రెండేళ్లుగా కరోనా వ్యాప్తి పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. ప్రస్తుతం చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్ తదితర జిల్లాలకు చెందిన 14 మంది మాత్రమే కరోనా స్వల్ప లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, సింగపూర్ దేశంలో కొత్త రకం కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా, ఒకే వారంలో 26,000 మందికి ఈ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. దీంతో, ఈ కొత్త రకం వైరస్‌ను నియంత్రించేలా ప్రజలందరూ తప్పకుండా మాస్కులు ధరించాలని ఆ దేశ ప్రభుత్వం ఆదేశించింది. తమిళనాడు-సింగపూర్ మధ్య పారిశ్రామికంగా, వాణిజ్య పరంగా మంచి సంబంధాలుండడంతో వందలాదిమంది తరచూ ప్రయాణిస్తుంటారు. ఈ కారణంగా రాష్ట్రంలోనూ కొత్త రకం కరోనా వైరస్ ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం మాట్లాడుతూ... సింగపూర్‌లో ప్రస్తుతం వ్యాపిస్తున్న కేపీ.1, కేపీ2 రకానికి చెందిన కరోనా వైరస్ అని, ఒమైక్రాన్ జేఎన్1 తరహాలోనే ఈ వైరస్ రూపాంతరం చెందాయని తెలిపారు. రాష్ట్రంలో జేఎన్1 రకం కరోనా వైరస్ లక్షణాలు ఫిబ్రవరిలోనే కనుగొన్నామన్నారు. అందువల్ల ఆ దేశంలో వ్యాపిస్తున్న కొత్త రకం వైరస్ ప్రభావం రాష్ట్రంలో ఉండే అవకాశం లేదన్నారు. కొత్త రకం వైరస్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కానీ, ముందస్తు జాగ్రత్తగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరం పాటించడం, ఇతర వ్యాధులున్న వారు, వృద్ధులు మాస్క్ ధరించడం తదితరాలు పాటిస్తే మంచిదని ఆయన తెలిపారు.

నేను మెచ్చిన యువ నేత రాహుల్

● అన్నాడీఎంకే సీనియర్ నేత సెల్లూర్ రాజు

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి సెల్లూర్ కె.రాజు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై ప్రశంసల జల్లు కురిపించారు. ఇటీవల కాలంలో తాను చూసిన,



మెచ్చిన యువ నాయకుడు రాహుల్ గాంధీయేనని కితాబిచ్చారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడైన కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ప్రశంసిస్తూ ఎక్స్ పేజీలో వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కాంగ్రెస్ డీఎంకే కూటమిలో వుంది. ఇరుపార్టీల నేతల మధ్య సన్నిహిత సంబంధాలు కూడా సాఫీగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే నేత హఠాత్తుగా కాంగ్రెస్ నేతను ప్రశంసించడం చర్చనీయాంశమైంది.

ఓట్ల కోసం విమర్శలా?

● తమిళుల్ని దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తారా?

● రాష్ట్రాల మధ్య శత్రుత్వం పెంచుతారా?

● ప్రధాని మోదీపై సీఎం స్టాలిన్ ధ్వజం

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ తన స్థాయి మరిచి తమిళ ప్రజలపై హేయమైన విమర్శలు చేయడం గర్హనీయమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో.. ఎన్నికల ప్రచారంలో కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం చేసిన మంచిపనులు, అమలు చేసిన పథకాలను గురించి ప్రధాని మోదీ ప్రస్తావించి వుంటే హుందాగా ఉండేదని, కానీ ఆయన ఎక్కడకు వెళ్ళినా ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేయడమే ఆనవాయితీగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఇంతకు ముందు ప్రధాని మోదీ ఉత్తరాది రాష్ట్రాల ప్రజలను దక్షిణ భారతీయులు, ప్రత్యేకించి తమిళులు కించపరిచేలా మాట్లాడుతున్నారంటూ అసత్య ప్రచారం చేశారన్నారు. మతం, జాతి, కులాల పేరిట రాష్ట్రాల నడుమ చిచ్చురగిల్చేందుకే మోదీ పనిగట్టుకుని ఇలాంటి కువిమర్శలకు పాల్పడుతున్నారన్నారు. దేశ ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించాల్సిన ప్రధాని ప్రస్తుతం ప్రజల నడుమ శత్రుత్వాన్ని పెంచుతున్నారని విమర్శించారు. ఒడిశాలో జరిగిన ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తూ పూరీ జగన్నాథస్వామి ఆలయ భాండాగారం తాళం చెవులు తమిళనాడు రాష్ట్రంలో ఉన్నాయంటూ విమర్శించి తమిళులందరూ దొంగలనే భావన కల్పించి రెండు రాష్ట్రాల నడుమ ఘర్షణ వాతావరణం కలిగించేందుకు ప్రయత్నించారన్నారు. దశాబ్దాల తరబడి ఒడిశా రాష్ట్రంతో సన్నిహిత సంబంధాలున్న తమిళనాడు రాష్ట్రాన్ని తమిళ ప్రజలను అవమానించేలా మోదీ ప్రసంగించారని ధ్వజమెత్తారు. పూరీ జగన్నాథస్వామిపై భక్తిశ్రద్ధలు కలిగిన ఒడిశా ప్రజలను తమిళులపై ఉసిగొల్పేలా మోదీ విమర్శలున్నాయన్నారు. తమిళనాట ప్రచారం చేసేటప్పుడు తమిళభాష, సంస్కృతిని మెచ్చుకునే మోదీ రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్ళి తమిళ ప్రజలను దొంగలుగా, ఉత్తరాది రాష్ట్రాల ప్రజలపై ద్వేషభావాలు కలిగినవారుగా చిత్రీకరించే అసత్య ప్రచారాలు చేయడం ఎంతవరకు సబబని నిలదీశారు. ఇకనైనా మోదీ ఓట్ల కోసం తమిళ ప్రజలపై విమర్శలు చేయడం మానుకుంటే మంచిదని స్టాలిన్ హితవు పలికారు.



కొడైకెనాల్‌లో పడవల పోటీ రద్దు



చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కొడైకెనాల్‌లో సమ్మర్ ఫెస్టివల్ సందర్భంగా మంగళవారం నిర్వహించాల్సిన పడవల పోటీని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. కొడైకెనాల్ పరిసర ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. అడవి వెల్లువల కారణంగా పలు చోట్ల వరద పెరిగింది. దీంతో పలు గ్రామాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్ళలేకున్నారు. ఈ నేపథ్యంలో కొడైకెనాల్‌లో ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో మంగళవారం జరగాల్సిన పడవల పోటీని రద్దు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కొడైకెనాల్‌లో మంగళవారం ఉదయం బోట్ సవారీ చేయడానికి పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమికూడారు.

● రూ.4 కోట్ల నగదు వ్యవహారం సీబీసీఐడీ విచారణకు పలువురి డుమ్మా



అడయార్, మే 21: గత మార్చిలో తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్లు స్వాధీనం కేసులో సీబీసీఐడీ విచారణ ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా బీజేపీ తమిళనాడు రాష్ట్ర కోశాధికారి ఎస్ఆర్ శేఖర్‌ను విచారించింది. పోలీసులు పలు ఆధారాలతో ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కేసులో విచారణకు రావాలని ఆర్ఎస్ఎస్ నేత కేశవ వినాయకంకు సమన్లు జారీ చేయగా, ఆయన గైర్హాజరైనట్లు తెలిసింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్న సమయంలో మార్చి 26న తాంబరం రైల్వే స్టేషన్‌లో రూ.4 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరిని తిరునెల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటల్‌లో పనిచేసే సతీష్, ఆయన సోదరుడు నవీన్, శ్రీవైకుంఠంకు చెందిన లారీ డ్రైవర్ పెరుమాళ్‌గా గుర్తించారు. విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు సీబీసీఐడీ పలువురిని దర్యాప్తు చేస్తోంది. ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎస్ఆర్ శేఖర్, బీజేపీ నేత మురళి, ఆర్ఎస్ఎస్ నాయకుడు కేశవ వినాయగం తదితరులకు సమన్లు జారీ చేసి ఎగ్మోర్‌లోని సీబీసీఐడీ ప్రధాన కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొంది. మంగళవారం ఉదయం 10 గంటలకు వారు హాజరు కావాల్సి ఉండగా తమకు మరికొంత సమయం కావాలంటూ ఆయా నేతలు తమ న్యాయవాదులతో సీబీసీఐడీకి సమాచారం పంపించారు. కాగా ఎస్ఆర్ శేఖర్ కోవైలోని తన నివాసంలో ఉన్నట్టు తెలుసుకున్న సీబీసీఐడీ డీఎస్పీ శశిధరన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం మంగళవారం ఉదయం ఆయన ఇంటికి వెళ్ళి విచారణ జరిపారు.

బెంగళూరు పేలుళ్ల కేసు ... కోవైలో ఎన్ఐఏ అధికారుల తనిఖీ

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు హోటల్‌లో సంభవించిన బాంబు పేలుళ్ల సంఘటనపై దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు కోయంబత్తూరులో నివసిస్తున్న ఇద్దరు డాక్టర్ల నివాసాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో మార్చి ఒకటిన రెండు బాంబులు పేలి పదిమంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. మొదట ఈ కేసును బెంగళూరు పోలీసులు దర్యాప్తు జరిపారు. ప్రస్తుతం జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేసి బాంబు పేలుడు ఘటనలో కీలకపాత్ర వహించిన శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళికి చెందిన ముజాబీర్ హుసేన్ సాజిబ్, అబ్దుల్ మదీన్ దాహా అనే వారిని అరెస్టు చేశారు. ఆ బాంబు పేలుడు సంఘటనకు సంబంధించి ఎన్ఐఏ అధికారులు చెన్నై, శివమొగ్గ, బెంగళూరు నగరాల్లో పలు మార్లు తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో ఆ బాంబు పేలుడు సంఘటనకు సంబంధించి ఎన్ఐఏ అధికారులు మంగళవారం ఉదయం కోవైలోని ఇద్దరు డాక్టర్ల నివాసాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. కోయంబత్తూరు సాయిబాబా కాలనీ పెరియకరుప్పణ్ణ గౌండర్ వీధిలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ జాఫర్ ఇక్బాల్ నివాసానికి మంగళవారం ఆరుగంటలకు ఇద్దరు ఎన్ఐఏ అధికారులు, కర్ణాటక రాష్ట్ర పోలీసులు వెళ్ళి సోదాలు జరిపారు. ఆ ఇంటిలోనికి వెళ్ళగానే అధికారులు అన్ని తలుపులు మూసివేసి, బయటి వ్యక్తులు ఎవరూ లోపలకు వెళ్ళకుండా కట్టుదిట్టం చేశారు. ఆ నివాసంలోని అన్ని గదుల్లోనూ ఎన్ఐఏ అధికారులు, బెంగళూరు పోలీసులతో కలిసి తనిఖీలు జరిపారు. జాఫర్ ఇక్బాల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను కూడా విచారించారు. ఆ సందర్భంగా అందరి మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇదే విధంగా ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న జాఫర్ ఇక్బాల్ బంధువైన డాక్టర్ నయన్ సాధిక్ నివాసంలో కూడా అధికారులు తనిఖీలు చేశారు. ఉదయం ఆరుగంటలకు ప్రారంభమైన సోదాలు 10.30 గంటల వరకు కొనసాగాయి. ఆ ఇద్దరు డాక్టర్ల సెల్‌ఫోన్లను, ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్‌లోని వివరాల ప్రకారం బాంబు పేలుడు సంఘటనకు సంబంధించిన మరిన్ని ఆధారాలు సేకరించేందుకు అధికారులు ప్రయత్నించనున్నారని తెలుస్తోంది. చివరకు ఆ ఇద్దరు డాక్టర్లను ఈ నెల 23న బెంగళూరులో జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశించారు.



కోయంబత్తూరులో ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు జరుపుతున్న ప్రాంతంలో పోలీసు బందోబస్తు

రాజీవ్‌కు ఘననివాళి

● సేవా కార్యక్రమాల్లో కాంగ్రెస్ శ్రేణులు





శ్రీ పెరుంబుదూర్‌లోని రాజీవ్ స్మారక మందిరంలో కాంగ్రెస్ నేతల నివాళి - రాజీవ్ స్మారక జ్యోతిని ఆహ్వానిస్తున్న సెల్వపెరుందగై, ఎంపీలు

ప్యారీస్, మే 21: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో నివాళి, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఉదయం 7 గంటలకు రాజీవ్ గాంధీ చిత్రపటానికి టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై, సీఎల్పీ లీడర్ రాజేష్‌కుమార్ నివాళులర్పించారు. అనంతరం స్వర్ణా సేతురామన్, రాజేష్, ఎంపీ విష్ణుప్రసాద్, ఎమ్మెల్యే రూబి మనోహరన్, ఎస్ఏ వాసు, మహిళా కాంగ్రెస్ నాయకులు హసీనా సయ్యద్, ప్రిన్స్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబు, ఏఐసీసీ సభ్యుడు రంగభాష్యం తదితరులు నివాళులర్పించి ఉగ్రవాద నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. తర్వాత సైదాపేటలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, పేదలకు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది ముత్తళగన్ నేతృత్వంలో 300 మందికి బియ్యం పంపిణీ, అన్నదానం చేశారు. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లోని రాజీవ్ స్మారక స్థలిలో కాంగ్రెస్ ఎంపీలు ఎస్.తిరునావుక్కరసర్, డా.విష్ణుప్రసాద్, ఎమ్మెల్యేలు రూబి మనోహరన్, ప్రిన్స్, మన్సూర్ అలిఖాన్ తదితరులు కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి యాత్రగా తీసుకొచ్చిన రాజీవ్ స్మారక జ్యోతికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ మరణించిన ప్రాంతంలో జ్యోతితో నాయకులు అంజలి ఘటించారు. ముందుగా శ్రీ పెరుంబుదూర్ జాతీయ రహదారిలో ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సెల్వ పెరుందగై ప్రారంభించారు. అదే విధంగా రాజీవ్ స్మారక మందిరంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఆయన, టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు పార్టీ తరఫున ఆర్థికసాయం పంపిణీ చేశారు.

అకాల వర్షాలు.. ఐదు రోజుల్లో 11 మంది మృతి

● పలు జిల్లాలకు సర్కారు హెచ్చరిక



తిరుప్పూర్‌లో సిద్ధంగా వున్న ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు

అడయార్, మే 21: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 11 మంది మరణించినట్టు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. కన్నియాకుమారి, కోయంబత్తూరు, తిరునెల్వేలి, నీలగిరి జిల్లాలకు భారీ వర్ష హెచ్చరికలను జారీ చేసింది. వర్ష ప్రభావిత జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా 296 మందితో కూడిన పది విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచింది. వాతావరణంలో మార్పుల కారణంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రంలోని 37 జిల్లాల్లో వర్షాలు కురవగా, గరిష్ఠంగా నామక్కల్ జిల్లాలో 7.12 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదైనట్టు రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రకటించింది. మంగళవారం కూడా తిరుచ్చి, తిరునల్వేలి, కోయంబత్తూరు తదితర జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలోకి భారీగా వరదనీరు ప్రవేశించింది. కాగా వర్ష హెచ్చరికల నేపథ్యంలో కోస్తా జిల్లాల్లో ముందస్తు హెచ్చరికలు చేపట్టారు. అలాగే, పశ్చిమ కనుమల్లోని కన్నియాకుమారి, తిరునెల్వేలి, తెన్‌కాశి, దిండిగల్, కోయంబత్తూరు, నీలగిరి, విరుదునగర్, తేని, తిరుచ్చి జిల్లాలకు భారీ వర్షసూచనలతో ఈ జిల్లాల వాసులకు ముందస్తు జాగ్రత్తలకు సంబంధించి ఎస్ఎంఎస్‌లు పంపించారు. అలాగే, వర్షబాధిత జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా 296 మంది నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందిని పది బృందాలను సిద్ధం చేసి, కన్నియాకుమారి, కోయంబత్తూరు, తిరునెల్వేలి, నీలగిరి జిల్లాల్లో సిద్ధంగా ఉంచారు.

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో గత ఐదు రోజుల్లో 11 మంది మృతి చెందారు. అలాగే, గత 24 గంటల్లో 12 పశువులు చనిపోగా, 24 గుడిసెలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని కోస్తా తీర ప్రాంతం, కన్నియాకుమారి, గల్ఫ్ ఆఫ్ మన్నార్ ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అందువల్ల జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని, సముద్రంలో చేపల వేటకు వెళ్లిన జాలర్లు ఈ నెల 23వ తేదీలోపు తీరానికి చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.



శ్రీరంగం ఆలయంలోకి వచ్చిన వరదనీరు

సమాచార దర్శిని

జూలై 15 నుంచి 'ప్రజలతో ముఖ్యమంత్రి'

పెరంబూర్, మే 21: 'ప్రజలతో ముఖ్యమంత్రి' పథకం రెండో విడతలో 12,225 గ్రామ పంచాయతీల్లో 2,500 ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. రెండో విడత ప్రజలతో ముఖ్యమంత్రి కార్యక్రమ ప్రత్యేక శిబిరాలు జూలై 15 నుంచి సెప్టెంబరు 15వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో స్వీకరించే వినతిపత్రాలపై ఆగస్టు 15 నుంచి అక్టోబరు 15వ తేది లోగా పరిష్కరించాలని నిర్ణయించినట్లు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

అన్ని విద్యుత్ సేవలకు ఒకే వెబ్‌సైట్

ఐసిఎఫ్, మే 21: అన్ని విద్యుత్ సేవలకు ఒకే వెబ్‌సైట్‌ను విద్యుత్ బోర్డు పరిచయం చేసింది. కొత్త విద్యుత్ కనెక్షన్, పేరు మార్పు, తాత్కాలిక విద్యుత్ కనెక్షన్, విద్యుత్ సాధనాల బదిలీ, బిల్లుల చెల్లింపులు వంటి వివిధ సేవలకు అనేక విధానాలు అమలులో ఉండగా, ప్రస్తుతం ఈ సేవలన్నింటికీ ఒకే రకమైన వెబ్‌సైట్‌ను విద్యుత్ బోర్డు పరిచయం చేసింది. ఇకపై app1.tangedco.org/nsconline/ అనే వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని వినియోగదారులకు సూచించింది.

జీపీఎఫ్ వివరాలు అప్‌లోడ్ చేయండి

ఐసిఎఫ్, మే 21: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు 2023-24వ సంవత్సరానికి సంబంధించిన జీపీఎఫ్ వివరాలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ యూనియన్, మున్సిపల్, ప్రాథమిక, మాధ్యమిక, మహోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, చెన్నై, మదురై కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు http:// cag.gov.in/ac/tamilnadu/en వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

మెడికల్ జర్నలిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, మే 21: తమిళనాడు డా.ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయ మెడికల్ జర్నలిజం డిప్లొమో కోర్సులో చేరేందుకు జూన్ 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరోగ్యం, వ్యాధుల వ్యాప్తి, వైద్యానికి సంబంధించిన చట్టాలు, వైద్య నేరాలు, పోషక లోపాలు, ఫార్మసీ వంటివి ఈ కోర్సులో ఉన్నాయి. డిగ్రీ పూర్తిచేసిన ఔత్సాహికులు www.tnmgrmu.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-22200713 నెంబరు సంప్రదించవచ్చు.

పాలిటెక్నిక్ పాఠ్యాంశం మార్పు

ఐసిఎఫ్, మే 21: రాష్ట్రంలో అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పనిచేసే పాలిటెక్నిక్‌లలో పాఠ్య పథకంలో మార్పులు జరిగాయి. ఈ పాలిటెక్నిక్‌లో గత ఏడాది రెండు సెమిస్టర్ల పాఠ్యాంశాన్ని మార్చగా, వచ్చే విద్యా సంవత్సరం మూడు నుంచి ఆరు సెమిస్టర్ల పాఠ్యాంశాలుగా మార్పు చేశారు.ఆ పాఠ్యాంశాలు dte.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో సాంకేతిక విద్య డైరెక్టరేట్ విడుదల చేసింది. వీటిపై విద్యావేత్తలు, ప్రొఫెసర్లకు ఏవైనా ఆక్షేపణలు, అభిప్రాయాలుంటే ఈ నెల 24వ తేది వరకు ఆన్‌లైన్‌లో తెలియజేయాలని డైరెక్టరేట్ ప్రకటించింది.

27 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, మే 21: ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో యూజీ కోర్సుల అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 27వ తేది వరకు పొడిగించినట్లు కళాశాల విద్యా డైరెక్టరేట్ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 16 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో యూజీ కోర్సుల మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 6న ప్రారంభమై సోమవారంతో ముగిసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు అధికారులు తెలిపారు.

ఆధార్ నెంబర్లు సమర్పించండి

ఐసిఎఫ్, మే 21: అన్ని పథకాల ద్వారా లబ్దిపొందేందుకు ఆధార్ నెంబర్లు సమర్పించాలని దివ్యాంగులకు ప్రభుత్వం సూచించింది. గుర్తింపు కార్డులు పొందని దివ్యాంగులు దరఖాస్తు చేసుకొనేటప్పుడు తప్పనిసరిగా తమ ఆధార్ నెంబరు అందజేయాలని, అప్పుడే వారికి అన్ని ప్రయోజనాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

రూ.5 కోట్లతో అర్బన్ డేటా సెంటర్

ఐసిఎఫ్, మే 21: నగరంలో రూ.5 కోట్లతో అర్బన్ డేటా సెంటర్ ఏర్పాటుకానుంది. నగర ప్రాంత సేవలు చేపడుతున్న వివిధ శాఖల డేటాను డిజిటలైజేషన్ చేసేందుకు సీఎండీఏ చర్యలు చేపట్టింది. ఇందుకోసం రూ.5 కోట్లతో రాష్ట్రప్రభుత్వ ఆమోదంతో అర్బన్ డేటా సెంటర్ ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్త థర్మల్ కేంద్రంలో విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మే 21: మేట్టూరులోని కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభమైంది. 600 మెగావాట్ల సామర్థ్యంతో కొత్త విద్యుత్ కేంద్రం, 840 మెగావాట్ల సామర్థ్యంతో పాత విద్యుత్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. కొత్త విద్యుత్ కేంద్రంలో ఈ నెల 16వ తేది బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కావడంతో ఉత్పత్తి నిలిచిపోయింది.మరమ్మతుల అనంతరం సోమవారం సాయంత్రం యథావిధిగా ఉత్పత్తి ప్రారంభమైంది.

ఎగ్మూర్-వేలాంకన్ని రైళ్ల రద్దు

పెరంబూర్, మే 21: నిర్వహణ కారణాల రీత్యా ఎగ్మూర్-వేలాంకన్ని వారాంతపు ప్రత్యేక రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.06037 చెన్నై ఎగ్మూర్-వేలాంకన్ని మధ్య చెన్నై ఎగ్మూర్ నుంచి రాత్రి 11.50 గంటలకు బయల్దేరే రైలు జూన్ 21,23,28,30 తేదీలు, నెం.06038 వేలాంకన్ని-చెన్నై ఎగ్మూర్ మధ్య వేలాంకన్ని నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయల్దేరే రైలు జూన్ 22,24,29, జూలై 1వ తేది పూర్తిగా రద్దయ్యాయి.

బయల్దేరే సమయంలో మార్పు...

నెం.06038 వేలాంకన్ని-చెన్నై ఎగ్మూర్ మధ్య ఈ నెల 25,27, జూన్ 1,3,8,10,15,17 తేదీల్లో వేలాంకన్ని నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బదులు సాయంత్రం 6.10 గంటలకు ప్రత్యేక రైలు బయల్దేరుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

సీఎండీఏ ప్రాజెక్ట్‌పై గ్రీన్ ట్రిబ్యునల్ స్టే

పెరంబూర్, మే 21: స్థానిక ఇంజంబాక్కం సముద్రతీరాన్ని సుందరీకరించే సీఎండీఏ ప్రాజెక్ట్‌పై దక్షిణ భారత గ్రీన్ ట్రిబ్యునల్ స్టే విధించింది. కోస్టల్ రెగ్యులేటరీ అథారిటీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ప్రస్తుతం సీఎండీఏ ఇంజంబాక్కం సముద్రతీరాన్ని సుందరీకరించే పనుల్లో భాగంగా తాబేళ్ల పెంపకం ప్రాంతాల్లో ఇసుక లెవలింగ్ చేపట్టింది. ఈ వ్యవహారంపై గ్రీన్ ట్రిబ్యునల్ సుమోటా కేసుగా పరిగణించి విచారణ చేపట్టి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

న్యూయార్క్ యూనివర్సిటీ నుంచి వీఐటీ చాన్సలర్‌కు గౌరవ డాక్టరేట్

పలువురు అభినందన



చాన్సలర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు జనార్ధనన్, దీనబంధు - చాన్సలర్‌కు జ్ఞాపిక అందిస్తున్న మాజీ మంత్రి కేసీ వీరమణి

ప్యారీస్, మే 21: అమెరికాలోని న్యూయార్క్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ కాట్పాడి డివిజన్ శాఖ అభినందనలు తెలిపింది. సంఘం అవై అధ్యక్షుడు జనార్ధనన్, వైద్య కమిటీ అధ్యక్షుడు డా.దీనబంధు తదితరులు మంగళవారం చాన్సలర్‌ను కలిసి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో అవై ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, కోశాధికారి పళని, రామచంద్రన్ తదితరులున్నారు.

అన్నాడీఎంకే నేతలు...

అన్నాడీఎంకే మాజీ మంత్రి, తిరుపత్తూర్ జిల్లా కార్యదర్శి కేసీ వీరమణి మంగళవారం వీఐటీ చాన్సలర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ వేల్‌అయగన్, కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు తదితరులున్నారు.

మేట్టూరు డ్యాంలో తగ్గుతున్న నీటిమట్టం

పూర్తిగా బయల్పడిన నంది విగ్రహం

పెరంబూర్, మే 21: సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం నీటిమట్టాలు 49 అడుగులకు తగ్గడంతో, డ్యాం పరీవాహక ప్రాంతంలో మునిగిన నంది విగ్రహం పూర్తిగా బయల్పడింది. ఈ డ్యాం 120 అడుగుల సామర్థ్యం కలిగి ఉంది. డ్యాం నీటిమట్టం 70 అడుగులకు తగ్గిన సమయంలో పన్నవాడి పరీవాహక ప్రాంతంలో నీటమునిగిన నంది విగ్రహం తల భాగం బయటపడుతుంది. ఫిబ్రవరి 4 వ తేది 70 అడుగులుగా ఉన్న నీటిమట్టం, 5వ తేది 69 అడుగులకు తగ్గడంతో విగ్రహం తల బయటకు కనిపించింది. ప్రస్తుతం నీటిమట్టాలు 49 అడుగులకు తగ్గడంతో 20 అడుగుల ఎత్తున్న నంది విగ్రహం పూర్తిగా కనిపిస్తోంది. దాని పక్కనే 10 అడుగుల ఎత్తున్న జలకంఠేశ్వరుని ఆలయ గోపురం కనిపించింది. ప్రస్తుతం డ్యాంలో 49.05 అడుగులతో 17.21 టీఎంసీ నీటిమట్టాలుండగా, డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు 2,100 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు.



నీరు తగ్గడంతో కనిపిస్తున్న నంది విగ్రహం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌కు ఘననివాళి

వేలూరు, మే 21: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకా రామన్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమం లో పార్టీ నిర్వాహకులు మూర్తి, ఏలుమలై, బాబు, ఎత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు, కార్యకర్తలు

మెదడు నిర్జీవమైన మహిళ అవయవదానం

వేలూరు, మే 21: గుడియాత్తం ఎళిల్‌నగర్‌కు చెందిన శశికుమార్ భార్య సంధ్య (41) తలనొప్పి కారణంగా ఈ నెల 17న వేలూరు సీఎంసీలో చేర్పించారు. సోమవారం ఆమె చికిత్స ఫలించక మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు తెలిపారు. దీంతో, ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా తీసిన అవయవాల్లో గుండె, లంగ్స్ చెన్నై ఎంజీఎం ఆసుపత్రికి, లివర్, ఎడమ కిడ్నీ రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి, కుడి కిడ్నీ వేలూరు నారాయణి ఆస్పత్రి, కళ్లు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి అందజేసినట్లు వైద్యులు తెలిపారు. సంధ్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడున్నారు.



సంధ్య (ఫైల్‌ఫొటో)

విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన

వేలూరు, మే 21: ఆదిద్రావిడులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్లస్ టూ పూర్తయిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. లక్ష్మీ గార్డెన్ మెట్రిక్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత ప్రారంభించారు. జిల్లా ఆదిద్రావిడ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, ప్రధాన విద్యాధికారి మణిమొళి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు

ఆనకట్ట నిర్మాణాలకు అనుమతులున్నాయా...?

● కేరళ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన గ్రీన్ ట్రిబ్యునల్

పెరంబూర్, మే 21: సిలంది నదిపై ఆనకట్ట నిర్మాణానికి సంబంధించి పర్యావరణ శాఖ, జాతీయ వన్యప్రాణుల బోర్డు అనుమతులు తీసుకున్నారా? అంటూ దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ కేరళ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేరళ రాష్ట్రం ఇడుక్కి జిల్లా దేవికులం తాలూకా వట్టవాట పంచాయతీ పెరుగుడ ప్రాంతంలో అమరావతి డ్యాం నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని అడ్డుకొనేలా సిలంది నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఆనకట్ట నిర్మాణంతో రాష్ట్రంలోని అమరావతి ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్యలు వస్తాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, సిలంది నదిపై కేరళ ప్రభుత్వం ఆనకట్ట నిర్మించే విషయమై సుమోటా కేసు నమోదుచేసిన గ్రీన్ ట్రిబ్యునల్ నిర్మాణానికి పర్యావరణ శాఖ, జాతీయ వన్యప్రాణుల బోర్డు అనుమతులు పొందారా అంటూ ప్రశ్నించి తగిన అనుమతులు పొందని పక్షంలో ఆనకట్ట నిర్మాణాలను కేరళ ప్రభుత్వం సత్వరం నిలిపివేయాలని ఉత్తర్వులు జారీచేయడంతో పాటు ఈ వ్యవహారమై బదులు పిటిషన్ దాఖలుచేయాలని కేరళ, తమిళనాడు ప్రభుత్వాలకు గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది.

వైభవంగా సాలై గంగమ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వేలూరు, మే 21: స్థానిక సత్తువాచేరిలో ప్రసిద్ధిచెందిన సాలై గంగమ్మ ఆలయ రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బ్యాండు వాయిద్యాలు, వేలాది మంది భక్తుల సమక్షంలో రథంలో ఊరేగించారు. తెల్లవారుజామున అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణ, దీపారాధన జరిగింది. భక్తులు పిండి నెయ్యి దీపాలు, కొబ్బరి కాయలు సమర్పించి, అంబిళ్లు పోశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, పలు స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, పానకం తదితరాలు అందజేశాయి.

వృద్ధురాలి వద్ద రూ.40 లక్షల మోసం

థౌజండ్‌లైట్ కానిస్టేబుల్ సస్పెన్షన్

అడయార్, మే 21: ఆన్‌లైన్ ట్రేడింగ్ పెట్టుబడి పేరుతో ఒక వృద్ధురాలి వద్ద రూ.40 లక్షల మేరకు మోసం చేసిన థౌజండ్‌లైట్ పోలీస్ స్టేషన్ ఫస్ట్‌గ్రేడ్ కానిస్టేబుల్ కృష్ణ ప్రదీశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... వెస్ట్ మాంబాళం, గోవిందన్ రోడ్డుకు చెందిన సుంతాయ్ (60) అనే వృద్ధురాలి వద్ద కృష్ణప్రదీశ్‌తో సహా మరికొందరు కలిసి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మించారు. కృష్ణప్రదీశ్‌తో మరికొందరు కలిసి దశలవారీగా రూ.40లక్షల మేరకు మోసం చేశారు.కాలక్రమంలో ఆమె జరిగిన మోసాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా కృష్ణప్రశీద్ మోసం చేసినట్టు తేలడంతో అయనను అరెస్టు చేశారు.

మదురై ఎయిమ్స్ నిర్మాణ వ్యయం పెంపు

పెరంబూర్, మే 21: మదురై తోపూర్ ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, 33 నెలల్లో పనులు పూర్తవుతాయని ఎయిమ్స్ నిర్వహణ కమిటీ తెలియజేసింది. మదురై తోపూర్‌లో 221 ఎకరాల్లో నిర్మించే ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణ వ్యయం రూ.1,978 కోట్ల నుంచి రూ.2,021 కోట్లకు పెంచినట్లు కమిటీ తెలిపింది. తొలివిడతలో వైద్యకళాశాల, అత్యవసర చికిత్సా విభాగం, ఇన్, ఔట్ పేషంట్ల విభాగాలు, విద్యార్థులకు హాస్టల్ తదితరాలు 18 నెలల్లో పూర్తిచేస్తామని ఆస్పత్రి నిర్మాణ సంస్థ ఎల్ అంట్ టి ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ఆసుపత్రి నిర్మాణాలకు రాష్ట్రప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో, మంగళవారం నుంచి పనులు ప్రారంభించామని ఆసుపత్రి నిర్వహణ కమిటీ ప్రకటన విడుదల చేసింది.

కువైట్‌లో అరెస్టయిన జాలర్లను విడిపించండి

ప్యారీస్, మే 21: ఉద్యోగం కోసం కువైట్ వెళ్లి అరెస్టయిన నలుగురు తమిళ జాలర్లను విడిపించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రప్రభుత్వం మరోసారి లేఖ రాసింది. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... 2023 డిసెంబరు 5వ తేది రామనాథపురం జిల్లాకు చెందిన నలుగురు జాలర్లను కువైట్ కోస్ట్‌గార్డ్ పోలీసులు అరెస్ట్ చేశారని, వారిని అక్కడున్న భారత దౌత్య కార్యాలయం ద్వారా విడిపించే చర్యలు చేపట్టాలని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రధాని నరేంద్ర మోదీకి ఫిబ్రవరి 9న లేఖ రాశారు. అయితే, జాలర్ల విడుదలకు సంబంధించి ఎలాంటి చర్యలు లేకపోవడంతో రెండో సారి మళ్లీ కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో, తమిళ జాలర్లను కువైట్ నుంచి విడిపించాలని కోరినట్లు సచివాలయం తెలిపింది.

ఈడీ విచారణకు హాజరైన జాఫర్‌సాధిక్ సోదరుడు

ప్యారీస్, మే 21: విదేశాలకు రూ.2 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు అక్రమంగా తరలించిన కేసులో జైలుపాలైన జాఫర్ సాధిక్ సోదరుడు సలీం మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. నుంగంబాక్కంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో జాఫర్‌సాధిక్ భార్య అమీనా ను ఈడీ అధికారులు సోమవారం సుమారు ఆరు గంటలు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో, సమన్లు అందుకున్న సలీం మంగళవారం ఉదయం 11.20 గంటలకు నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయానికి వెళ్లారు. అతడిని మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఏఏ దేశాలకు తరలించారు, ఆదాయ వివరాలపై నాలుగు గంటలు ప్రశ్నించినట్లు తెలిసింది.

తమిళనాడుకు 2 టీఎంసీలు విడుదల చేయాలి

● కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వులు

ప్యారీస్, మే 21: కావేరి నదీజలాల నుంచి తమిళనాడుకు 2.5 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సిందిగా కర్ణాటక ప్రభుత్వానికి కావేరి నిర్వాహక మండలి మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మధ్య కొలిక్కిరాని కావేరి నదీజలాల పంపిణీ వ్యవహారానికి పరిష్కారం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కావేరి నిర్వాహక మండలి నియమించింది. ఈ మండలి సభ్యులు ఢిల్లీలో సమావేశమై రాష్ట్రప్రభుత్వాల తరపున అందజేసిన వినతిపత్రాలు పరిశీలిస్తున్నారు. ఆ మేరకు ఇటీవల కావేరి నిర్వాహక మండలి 96వ సమావేశం ఆ కమిటీ ఛైర్మెన్ వినీత్‌గుప్తా అధ్యక్షతన జరిగింది. ఇందులో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక రాష్ట్రాల సభ్యులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు మేరకు పెండింగ్‌లో ఉంచిన 95 టీఎంసీల కావేరి నీటిని తక్షణం విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం తరఫున అధికారులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రానికి తక్షణం 2.5 టీఎంసీల కావేరి నీటిని విడుదల చేయాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కావేరి నిర్వాహక మండలి ఆదేశించింది.

తల్లిని తిట్టాడని తండ్రి హత్య

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపం తిరుమళిసై వద్ద తల్లిని తిట్టాడనే ఆగ్రహంతో తండ్రిని హతమార్చిన సంఘటన తీవ్ర కలకలం సృష్టించింది. తిరుమళిసై ప్రాంతంలో బాబు అనే వడ్రంగి భార్య దేవి, కుమారుడు తమిళరసన్ నివసిస్తున్నారు. బాబుకు తాగుడు అలవాటు ఉంది. రోజూ తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడుతుండేవాడు. సోమవారం రాత్రి కూడా బాబు తాగి ఇంటికి వెళ్ళి భార్య దేవితో గొడవపడ్డాడు. ఆ సందర్భంగా దేవిని నానాదుర్భాషలాడారు. ఆ సమయంలో అక్కడే ఉన్న తమిళరసన్ తండ్రిపై ఆగ్రహించి చితకబాది నెట్టాడు. దీంతో నేలపై పడిన బాబు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న వెల్లవేడు పోలీసులు వెళ్లి బాబు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు.

తిరునల్వేలిలో రౌడీ దారుణహత్య

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో పేరుమోసిన రౌడీ దీపక్‌రాజా (30)ను గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఈ సంఘటనపై ఆగ్రహించిన దీపక్‌రాజా కుటుంబీకులు పోస్టుమార్టం తర్వాత దీపక్‌రాజా మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించారు. దీపక్ రాజా సోమవారం మధ్యాహ్నం తిరునల్వేలి-తిరుచెందూరు రోడ్డులో పాళై కేటీసీ నగర్ వద్దనున్న హోటల్‌కు వెళ్ళాడు.ఆతర్వాత హోటల్ నుంచి బయటకు వస్తుండగా అక్కడే మాటు వేసిన ఆరుగురు దుండగులు వేటకొడవళ్లతో దాడిచేసి హతమార్చి పారిపోయారు. హత్యకు గురైన దీపక్‌రాజాపై పలు పోలీసుస్టేషన్లలో హత్య, దోపిడీ తదితర కేసులున్నాయి. ఇటీవల దీపక్‌రాజాకు ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరితో ఘర్షణలు జరిగాయి. ఆ నేపథ్యంలోనే హత్య జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా హంతకులను అరెస్టు చేసేంతవరకూ దీపక్‌రాజా మృతదేహాన్ని తీసుకునే ప్రసక్తి లేదంటూ అతడి కుటుంబీకులు పేర్కొన్నారు. దీంతో పోలీసులు వారితో చర్చలు జరుపుతున్నారు.

సత్యమంగళంలో ఏనుగు మృతి

ప్యారీస్, మే 21: ఈరోడ్ జిల్లా సత్యమంగళం అటవీ ప్రాంతంలో అనారోగ్యం కారణంగా ఓ మగ ఏనుగు మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. సత్యమంగళం పులుల శరణాలయంలో పులులు, ఏనుగులు, జింకలు, ఎలుగుబంట్లు సహా పలువన్యప్రాణులున్నాయి. పెరుంపల్లం డ్యాం సమీపంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై స్పృహ తప్పిన ఏనుగుకు అటవీ శాఖ అధికారులు సమక్షంలో వెటర్నరీ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే చికిత్స ఫలించక మంగళవారం ఉదయం ఏనుగు మృతి చెందిందని అధికారులు తెలిపారు.



ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత తెలుగు బోధనా తరగతులు

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ఆధ్వర్యంలో జూన్ నుంచి ప్రతి శనివారం సాయంత్రం 4 గంటలకు ఉచిత తెలుగు బోధనా తరగతులు జరుగనున్నాయి. టి.నగర్, జీఎన్ చెట్టి రోడ్డులో వున్న అంకుర్‌ప్లాజాలోని సమాఖ్య కార్యాలయంలో జరుగనున్న ఈ తరగతులకు ఔత్సాహికులందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు లక్ష్మీ మోహన్‌రావు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ శివకుమారిని (9940368880), లేదా సమాఖ్య నిర్వాహకులను గానీ (7305557322 / 9841616465) సంప్రదించవచ్చు.

ఎన్నాళ్లీ డొక్కు బస్సుల్లో ప్రయాణం

● రవాణా సంస్థపై ఈపీఎస్ ఆగ్రహం



ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో రవాణా సంస్థ బస్సులన్నీ సక్రమంగా నడిచేవని, డీఎంకే ప్రభుత్వంలో డొక్కు బస్సుల్లోనే ప్రజలు ప్రయాణించాల్సిన దుస్థితి పట్టిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో రవాణా సంస్థ నష్టాల్లో నడిచినా ప్రజల శ్రేయస్సుకే ప్రాధాన్యతనిచ్చి మంచి కండిషన్‌లో ఉన్న బస్సులనే నడిపినట్లు తెలిపారు. మూడేళ్ల డీఎంకే పాలనలో రవాణా సంస్థ బస్సులన్నీ అధ్వాన్నంగా మారాయని, ఏవో కొన్ని కొత్త బస్సులు కొనుగోలు చేయడం మినహా పాత బస్సులనే నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఇక బస్సులలో పనిచేస్తున్న కండెక్టర్లు, డ్రైవర్లు కూడా ఈ డొక్కు బస్సులలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారని ఆయన వివరించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కండిషన్ బాగాలేని బస్సులను తొలగించి కొత్త బస్సులను నడిపేలా చర్యలు చేపట్టాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

వేంగైవయల్ వ్యవహారం

చార్జిషీటుకు మరో నెల గడువు కోరిన సీబీసీఐడీ

పెరంబూర్, మే 21: పుదుకోట జిల్లా వేంగైవయల్ వ్యవహారంలో చార్జిషీటు దాఖలుకు మరో నెల రోజులు అవకాశం కల్పించాలని న్యాయస్థానంలో సీబీసీఐడీ పిటిషన్ దాఖలుచేసింది. 2022 డిసెంబరు 26వ తేది వేంగైవయల్ గ్రామం దళితుల కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లో మానవ వ్యర్థాలు కలవడం రాష్టంలో కలకలం రేపింది. ఈ వ్యవహారంపై విచారణకు సీబీసీఐడీకి బదిలీ చేశారు. సంఘటన చోటుచేసుకొని 512 రోజులు గడిచినా ఇప్పటి వరకు న్యాయస్థానంలో సీబీసీఐడీ చార్జిషీటు దాఖలు చేయలేదు. ఈ క్రమంలో, చార్జిషీటు దాఖలుకు మరో నెల రోజులు అవకాశం కల్పించాలని మంగళవారం న్యాయస్థానంలో సీబీసీఐడీ పిటిషన్ వేసింది. కాగా, మరో నెల అవకాశం కోరుతూ సీబీసీఐడీ తాజాగా 10వ సారి పిటిషన్ దాఖలుచేయడం గమనార్హం.

కొట్టం లేని యజమానుల పశువుల స్వాధీనం

ఐసిఎఫ్, మే 21: కొట్టాములు లేకుండా రోడ్లపై వదిలేసే పశువులను స్వాధీనం చేసుకోనున్నట్లు చెన్నై కార్పొరేషన్ హెచ్చరించింది. పశువులు పెంచేవారు కాల్వల పక్కన, రహదారుల సమీపంలో వదిలేస్తున్నారని, ఇవి అక్కడి నుంచి రోడ్ల పైకి వచ్చి వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయని కార్పొరేషన్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన కార్పొరేషన్, పశువుల యజమానులు తప్పనిసరిగా షెడ్లు ఏర్పాటుచేసుకోవాలని లేని పక్షంలో జూన్ నుంచి రోడ్లపై పశువులు కనిపిస్తే వాటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించింది.

ఆలయ స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, మే 21: స్థానిక తాంబరం సమీపంలో ఆక్రమణకు గురైన ఆలయ స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పెరుంగళత్తూర్‌లో ఈందముక్కల్ జాలాంబాళ్ ఆలయం ఉంది. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయానికి చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించి 13 ఇళ్లు నిర్మించారు. సమాచారం అందుకున్న అధికారులు, ఆక్రమణలు తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు.

తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో 'రీల్స్'...

ముగ్గురు మహిళల సహా నలుగురిపై కేసు

పెరంబూర్, మే 21: తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో 'రీల్స్' చేసిన ముగ్గురు మహిళలు సహ నలుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫాంపై ఉన్న గూడ్సు రైలు, స్టేషన్ ప్రాంగణాల్లో ముగ్గురు మహిళలు డాన్స్ చేస్తూ తీసిన 'రీల్స్' సోషల్ మీడియాలో వైరల్ అయింది.. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు మహిళలు, ఈ దృశ్యాలను వీడియో తీసిన యువకుడు మొత్తం నలుగురిపై కేసు నమోదుచేశారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన రైల్వే పోలీసులు, ఇలాంటి పనులు చేయరాదని హెచ్చరించి పంపించేశారు.

వ్యభిచారం చేస్తున్న మహిళ సహా ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, మే 21: స్థానిక ట్రిప్లికేన్ ప్రాంతంలో వ్యభిచారం చేస్తున్న మహిళ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రిప్లికేన్ మసీదు వీధిలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, ఆదివారం రాత్రి ఆ ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు ట్రిప్లికేన్ ప్రాంతానికి చెందిన ఫాతిమా, ఆర్ఏ పురం శ్రీనివాసపురానికి చెందిన జాఫర్‌లను అరెస్ట్ చేశారు. అలాగే, ఆ గదిలో ఉన్న ఓ యువతిని రక్షించి ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయం..

58 మంది అరెస్ట్

పెరంబూర్, మే 21: నగరంలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 58 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులతో 'డ్రైవ్ అగనెస్ట్ డ్రగ్స్' పేరుతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు నిర్వహించిన తనిఖీల్లో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యవహారంలో 31 కేసులు నమోదుచేసి 58 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 61.42 కిలోల గంజాయి, 2.5 గ్రాముల మెథాపెటామైన్, 5,789 నొప్పి నివారణ మాత్రలు, 13 సెల్‌ఫోన్లు, రూ.50,600 నగదు, 8 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 20వ తేది వరకు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న 133 మందిపై గూండా చట్టం ప్రయోగించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

23 కిలోల గంజాయి స్వాధీనం

వేలూరు, మే 21: గుడియాత్తం రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో సీఐ పార్థసారధి నేతృత్వంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన యువకులను అనుమానించి అదుపులోకి తీసుకొని విచారించారు. తేని జిల్లాకు చెందిన మహమ్మద్ కాలిద్, తిరుప్పూర్ జిల్లాకు చెందిన అభిషేక్‌లుగా తెలిసింది. వారి బ్యాగులు తనిఖీ చేసిన పోలీసులు 23 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకొని, వారిని అరెస్ట్ చేశారు. ఒడిసా నుంచి రైలులో తిరుప్పూర్‌కు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది.

ఇంటి పైకప్పు కూలి వృద్ధురాలి మృతి

ప్యారీస్, మే 21: స్థానిక సైదాపేటలో మంగళవారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు కూలి వృద్ధురాలు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సైదాపేట దొరైస్వామి గార్డెన్ రెండో వీధిలోని ఇంట్లో చెల్లమ్మాళ్ (62), ఆమె సోదరి కన్నియమ్మాళ్, ఇతర కుటుంబ సభ్యులు నివిస్తున్నారు. సోమవారం రాత్రి భోజనానంతరం వారు నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో హఠాత్తుగా ఇంటి పైకప్పు కూలి చెల్లమ్మాళ్‌పై పడింది. ఆమె సంఘటన స్థలంలోనే మృతిచెందారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

మాజీ డీఎస్పీ ఇంటి విద్యుత్ కనెక్షన్ నిలిపివేత

ప్యారీస్, మే 21: మాజీ డీఎస్పీ రాజేష్‌దాస్ ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను నిలిపివేసిన వ్యవహారంలో మాజీ భార్య, ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి బీలాపై ఫిర్యాదు చేశారు. 2021వ సంవత్సరం మహిళా ఎస్ఐపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో మాజీ డీఎస్పీ రాజేష్‌దాస్‌కు విల్లుపురం కోర్టు మూడేళ్ల జైలుశిక్ష విధించింది. ఈ తీర్పును విల్లుపురం సెషన్స్ కోర్టు, మద్రాసు హైకోర్టులు నిర్ధారించాయి. అయితే, రాజేష్‌దాస్ అరెస్ట్‌పై సుప్రీం కోర్టు స్టే విధించింది. ప్రస్తుతం నగర శివారులోని తయ్యూరులో ఉన్న ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను రెండు రోజుల క్రితం విద్యుత్ అధికారులు నిలిపివేశారు. దీనిపై స్పందించిన రాజేష్‌దాస్, ఇంధన శాఖ కార్యదర్శిగా ఉన్న తమ మాజీ భార్య బీలా వెంకటేశన్ ఆదేశం మేరకు విద్యుత్ శాఖ అధికారులు తన ఇంటి విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుడువాంజేరి పోలీస్ క్వార్టర్స్‌లో పేలిన నాటుబాంబు

ప్యారీస్, మే 21: స్థానిక గుడువాంజేరిలోని పోలీస్ క్వార్టర్స్‌లో నాటుబాంబు పేలిన ఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. గుడువాంజేరి జీఎస్టీ రహదారిలో పోలీస్‌స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీసు కార్యాలయం, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్స్‌లో 50కి పైగా పోలీసు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ క్వార్టర్స్‌లో సోమవారం హఠాత్తుగా పెద్ద శబ్దం వినిపించడంతో పోలీసులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై జరిపిన విచారణలో, క్వార్టర్స్‌లో పెట్రోల్ బాంబ్ పేలిందని, ఈ ప్రమాదంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయాలైనట్లు తెలిసింది. దీనిపై కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

చిత్రజ్యోతి

హాస్య నటులను తక్కువగా అంచనా వేయొద్దు : ఎస్కే

● 'గరుడన్' ఆడియో రిలీజ్



ఆడియో రిలీజ్ వేడుకలో శివకార్తికేయన్, సూరి, విజయ్ సేతుపతి

అన్ని రకాల పాత్రలను అలవోకగా పోషించగల సత్తా, సామర్థ్యం, ప్రతిభ హాస్య నటుల్లో ఉంటుందని, అందువల్ల కమెడియన్స్‌ను తక్కువ అంచనా వేయొద్దని హీరో శివకార్తికేయన్ అన్నారు. హాస్య నటుడు సూరి హీరోగా రూపుదిద్దుకున్న చిత్రం 'గరుడన్'. సీనియర్ నటుడు శశికుమార్ కీలక పాత్ర పోషించారు. ఉన్ని ముకుందన్, రేవతి శర్మ, షివద, రోషిణి, హరిప్రియన్, సముద్రఖని, ఆర్.వీ ఉదయకుమార్, మైమ్ గోపి, మొట్టై రాజేంద్రన్, వడివుక్కరసి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించగా, కె.కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి ఆర్.ఎస్.దురై సెంథిల్ కుమార్ దర్శకుడు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. విజయ్ సేతుపతి, శివకార్తికేయన్ ముఖ్య అతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఇందులో శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'సీరియస్ పాత్రలు చేసే నటుడు అన్ని రకాల పాత్రలను పోషించలేడు. కానీ, ఒక హాస్య నటుడు ఎలాంటి పాత్రనైనా పోషించగలడు. అలాంటి సత్తా, ప్రతిభ వారిలో ఉంటుంది. అందువల్ల హాస్య నటులను తక్కువ అంచనా వేయొద్దు. 'విడుదలై' తర్వాత సూరి కెరీర్ మారిపోయింది. వెట్రిమారన్ దర్శకత్వంలో అవకాశం వచ్చిందని చెప్పగానే మరో ఆలోచన చేయకుండా అంగీకరించాలని సూచించాను' అన్నారు. హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'నేను, సూరి అతి తక్కువ చిత్రాల్లో నటించాం. ఒక హాస్య నటుడిని సినిమా పట్ల, అతని నటన పట్ల ఉన్న అంకితభావం ఈ స్థానానికి తీసుకొచ్చింది. చిత్తశుద్ధిగా చేస్తే సినిమా ఎన్నటికీ చేయి వదిలిపెట్టదు. సక్సెస్ ఖాయం' అని పేర్కొన్నారు. హీరో సూరి మాట్లాడుతూ, 'కామెడీ నటుడుగా ఉన్న నన్ను హీరోగా చేసిన వెట్రిమారన్‌కు జీవితాంతం రుణపడివుంటాను. ఇపుడు సూరి జీవితం 'విడుదలై'కు ముందు, తర్వాతగా మారిపోయింది. హీరో అవకాశం అనగానే ఒకవైపు సంతోషంగా ఉన్నప్పటికీ.. తప్పటడుగు వేస్తే పరిస్థితి ఏంటి? హాస్య పాత్రలతో పాటు హీరో అవకాశాలు కూడా రావని భయపడ్డాను. 'గరుడన్' ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అన్నారు. దర్శకుడు వెట్రిమారన్ మాట్లాడుతూ, 'గరుడన్'లో సూరి పాత్ర కంటే శశికుమార్ పాత్ర ఎంతో కీలకం. ఆ పాత్రలో నటించేందుకు అంగీకరించినందుకు శశికుమార్‌కు ఆయన ధన్యవాదాలు' తెలిపారు. అలాగే, నటుడు శివకుమార్, సీనియర్ నటి వడివుక్కరసి, చిత్ర దర్శకుడు సెంథిల్ కుమార్, నిర్మాత కె.కుమార్, హీరోయిన్ రేవతి శర్మ తదితరులు ప్రసంగించారు. ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలకానుంది.

ఐఐటీఎంలో 'సెంటర్ ఫర్ మ్యూజిక్ రీసెర్చ్'

● ప్రారంభించిన ఇళయరాజా



'సెంటర్ ఫర్ మ్యూజిక్ రీసెర్చ్'ను ప్రారంభిస్తున్న ఇళయరాజా తదితరులు

దేశంలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటైన ఐఐటీ-మద్రాస్‌లో కొత్తగా సెంటర్ ఫర్ మ్యూజిక్ రీసెర్చ్ నెలకొల్పారు. దీనిని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనా రెడ్డి, ఐఐటీఎం డైరెక్టర్ కామకోటి తదితరులు పాల్గొన్నారు. ఇందులో ఇళయరాజా మాట్లాడుతూ, 'సంగీతం నేర్చుకోవాలన్న ఆశతో ఒక గ్రామం నుంచి చెన్నై వచ్చాను. మా అమ్మ, మా అన్న భాస్కర్ కలిసి రూ.400 ఇచ్చి పంపించారు. కానీ, వచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు నేను సంగీతం నేర్చుకోలేదు. సంగీతాన్ని నేర్చుకునేందుకు వచ్చిన నేను ఇపుడు మద్రాస్ ఐఐటీలో ఒక సంగీత శిక్షణా కేంద్రానికి ప్రారంభోత్సవం చేస్తున్నాను. ఒక వ్యక్తి మంచినీరు అడిగితే అతనికి నీళ్ళు ఇవ్వకూడదు. అతనికి దాహం వేసేలా చేయాలి. ఈ దాహం మరింత ఎక్కువైతే అతనే మంచినీళ్ళ కోసం వెంపర్లాడతాడు. అలాంటిదే చదువు. ప్రతి ఒక్కరికీ చదువుకోవాలన్న ఆశ కలగాలి. అపుడే లక్ష్యం ఎలాంటిదైనా దానిని చేరుకోగలం. నేను గ్రామం బయలుదేరి వచ్చినపుడు ఎలా ఉన్నానో ఇపుడు కూడా అలానే ఉన్నాను' అని ఆయన అన్నారు.

విజయ్ సరసన అపర్ణ

అగ్రహీరో విజయ్ సరసన కన్నడ నటి అపర్ణ బాలమురళి నటించనున్నట్టు సమాచారం. ఇందుకోసం ఆమెతో సంప్రదిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం హీరో విజయ్ 'గోట్' చిత్రంలో నటిస్తున్నారు. ఆ తర్వాత హెచ్.వినోద్ దర్శకత్వంలో తన 69వ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్క్రిప్టు పనులు పూర్తి చేసిన హెచ్.వినోద్.. నటీనటుల ఎంపికపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా హీరోయిన్‌గా అపర్ణ బాలమురళిని ఎంపిక చేసేందుకు ఆమెతో సంప్రదించినట్టు సమాచారం. గతంలో సూర్య నటించిన 'సూరరై పోట్రు' చిత్రంలో అపర్ణ బాలమురళి నటనకు జాతీయ అవార్డు దక్కిన విషయం తెల్సిందే. ఇపుడు ధనుష్ కొత్త చిత్రం 'రాయన్'లో కూడా ఆమె ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.



అపర్ణ బాలమురళి

యోగిబాబు 'వానవన్' షూటింగ్ పూర్తి



కేక్ కట్టింగ్ వేడుకల్లో 'వానవన్' చిత్ర బృందం

ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు ప్రధాన పాత్రలో ఈడెన్ ఫ్లిక్స్ ప్రొడక్షన్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న చిత్రం 'వానవన్'. సజిన్ కె.సురేంద్రన్ దర్శకుడు. యోగిబాబు, రమేష్ తిలక్ ప్రధాన పాత్రలు పోషించగా, కాళివెంకట్, లక్ష్మీ ప్రియా చంద్రమౌళి, మాస్టర్ శక్తి రిత్విక్, ప్రార్థనా నాథన్, కల్కి రాజా తదితరులు నటించారు. ఈ చిత్రం షూటింగ్ తాజాగా పూర్తి చేసుకుంది. యోగిబాబు కామెడీ టచ్‌లో ఫీల్ గుడ్, ఫాంటసీ జానర్‌లో చిన్నారులు, ఫ్యామిలీ ఆడియన్స్ చూసి ఎంజాయ్ చేసేలా హాస్యభరిత చిత్రంగా రూపొందిస్తున్నారు. కేరళకు చెందిన సజిన్ కె.సురేంద్రన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మదురై, చెన్నై పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంది. ఈడెన్ ఫ్లిక్స్ ప్రొడక్షన్ పతాకంపై అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త థామస్ రెన్ని జార్జ్ నిర్మించారు. గత యేడాది సాయి పల్లవి ప్రధాన పాత్రలో వచ్చిన 'గార్గి' చిత్రానికి థామస్ సహ నిర్మాతగా వ్యవహరించారు. త్వరలోనే టీజర్, ట్రైలర్ తేదీని వెల్లడించనున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటుంది.

నాగపట్టినంలో నిశ్చితార్థం..

లండన్‌లో వివాహం



లండన్ మురుగన్ ఆలయంలో విజయ్, అరుంధతిల వివాహానికి హాజరైన మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమజంట నాగపట్టినంలో పెళ్ళి నిశితార్థం జరుపుకుని లండన్‌లో వివాహం చేసుకుంది. లండన్‌లో ఉద్యోగం చేస్తున్న ప్రియుడికి స్వదేశానికి వచ్చేందుకు సెలవులు, వీసా లభించకపోవడంతో యువతి పట్టుదల కారణంగా లండన్‌లోని మురుగన్ ఆలయం వివాహవేదికగా మారింది. వీరి ప్రేమ వివాహానికి అనుకోని అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు హాజరై ఆ జంటను ఆశీర్వదించడం మరీ విశేషం. నాగపట్టినం మేల్‌సాత్తి ప్రాంతానికి చెందిన డీఎంకే నాయకుడు రామనాథన్ కుమార్తె అరుంధతి తంజావూరు జిల్లా బాగల్‌కోటకు చెందిన సుబ్రమణ్యేశ్వరన్ పరమేశ్వరి దంపతుల కుమారుడు విజయ్ నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. విజయ్ చదువు పూర్తి చేసుకుని లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. వీరి ప్రేమకు రెండు కుటుంబాలు పచ్చజెండా ఊపారు. గత మూడో తేది వీరి వివాహ నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత వీరికి త్వరగా వివాహం చేసేందుకు కుటుంబీకులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వరుడికి సెలవులు లేకపోవడంతో వెంటనే లండన్‌కు వెళ్ళిపోయారు. మళ్ళీ సెలవులు దొరకడం కష్టమని విజయ్ చెప్పారు. ఈ నేపథ్యంలో అరుంధతి ప్రేమికుడిని కలిసి వివాహం చేసుకునేందుకు ఒంటరిగా లండన్ వెళ్ళి బంధువు ఇంటిలో దిగింది. ఆ తరువాత వధూవరుల తల్లిదండ్రులు, దగ్గరి బంధువులు కూడా లండన్ చేరుకున్నారు. లండన్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వారి ప్రేమవివాహాన్ని జరపాలని పెద్దలు నిర్ణయించారు. ఆ మేరకు ఆ ఆలయంలో వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. కాకతాళీయంగా ఆ ఆలయానికి వెళ్ళిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు వీరి ప్రేమ వివాహానికి హాజరై నవదంపతులను ఆశీర్వదించారు.

ప్రగతిపథంలో విద్యా రంగం

● సర్కారు ప్రకటన

అడయార్, మే 21: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న బృహత్తర పథకాలతో రాష్ట్ర విద్యా రంగం ప్రగతిపథంలో పయనిస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. సీఎంగా స్టాలిన్ ఎంపికైన తర్వాత 2021 నుంచి ప్రతి విద్యార్థికి నాణ్యమైన అల్పాహారం అందించాలన్న నిర్ణయంతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ అల్పాహార పథకం కింద 2.50 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం కోసం రూ.600 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ అల్పాహార పథకాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు తెలంగాణా ప్రభుత్వం ముందుకు వచ్చింది. అలాగే, కెనడా దేశ ప్రధానమంత్రి కూడా ఈ పథకాన్ని అభినందించారు. అదేవిధంగా ఇంటి వద్దకే విద్యా పథకం కింద 1.65 లక్షల మంది ఎన్జీవోలతో 24 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు వీలుగా 4,989 సెకండరీ గ్రేడ్ టీచర్లు, 5,154 డిగ్రీ గ్రేడ్ టీచర్లు, 3,876 పీజీ గ్రేడ్ టీచర్లతో కలిసి మొత్తం 14,019 ఉపాధ్యాయులను పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా 76 ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంలను తాలూకా విద్యా అధికారులుగా పదోన్నతి కల్పించారు. ప్రతి యేటా ప్రభుత్వ పథకాలన్నింటినీ విజయవంతంగా అమలు చేస్తున్న వంద మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేస్తున్నారు. ఇలా ప్రభుత్వం చేపట్టిన అనేక బృహత్తర పథకాల వల్ల రాష్ట్ర విద్యా రంగం ప్రగతి పథంలో పయనిస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

24 నుంచి ఎంబీఏ కౌన్సెలింగ్

● సీఐఐ స్కూల్ ఆఫ్ లాజిస్టిక్ వెల్లడి

అడయార్, మే 21: ముంబైలోని అమిటీ యూనివర్శిటీ భాగస్వామి ది సీఐఐ స్కూల్ ఆఫ్ లాజిస్టిక్ ఈ నెల 24 నుంచి ఎంబీఏ అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనుంది. కోయంబత్తూరులోని పులియకుళంలో ఉన్న భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) జోనల్ ఆఫీస్‌లో 24వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని స్కూల్ ఆఫ్ లాజిస్టిక్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. రెండేళ్ళ పూర్తిస్థాయి కోర్సులో డేటా అనలిక్స్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఈ-కామర్స్, ఒమ్నీచానెల్ రీటైల్, గ్లోబల్ ప్రొక్యూర్‌మెంట్ వంటి సబ్జెక్టుల్లోని సీట్ల భర్తీకి ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 2016లో ప్రారంభించిన సీఐఐ స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్ ఇప్పటివరకు ఎనిమిది బ్యాచ్‌లను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ స్కూల్‌కు చెందిన నోయిడా - ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా క్యాంపస్‌లలో వంద శాతం ప్లేస్‌మెంట్‌తో విద్యార్థులు డిగ్రీలను పూర్తి చేశారు. ఎంబీఏ అడ్మిషన్ కౌన్సెలింగ్ సెషల్ లాజిస్టిక్స్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో కెరీర్ ఆలోచించే విభిన్న నేపథ్యాల నుంచి ఔత్సాహిక గ్రాడ్యుయేట్లతో కీలక వేదికగా పనిచేయనుంది.

రూ.823 కోట్లతో

బ్రాడ్ వే బస్టాండ్ ఆధునికీకరణ

● నమూనా చిత్రాల విడుదల







మద్రాసు హైకోర్టు సమీపంలోని బ్రాడ్‌వేలో నిర్మించనున్న కొత్త బస్టాండ్ నమూనా చిత్రాలు

ప్యారీస్, మే 21: మద్రాసు హైకోర్టు సమీపంలోని బ్రాడ్‌వేలో నూతనంగా రూ.823 కోట్లతో బస్ స్టేషన్ నిర్మించనున్నారు. ఈ బస్‌స్టేషన్‌కు సంబంధించిన నమూనా చిత్రాలు మంగళవారం విడుదల చేశారు. రాజధాని నగరం లో ప్యారీస్, బ్రాడ్‌వే, ఫ్లవర్ బజార్, ఎస్ప్లనేడు, హైకోర్టు ప్రాంగణాల నుంచే గతంలో దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపేవారు. అదే విధంగా ఎంటీసీ సిటీ బస్సులను కూడా బ్రాడ్‌వే నుంచే నడుపుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు దీటుగా సిటీ బస్సుల సంఖ్య కూడా ఎంటీసీ పెంచింది. అందువల్ల ప్రస్తుతం ఉన్న బ్రాడ్‌వే బస్టాండ్‌లో అవసరమైన స్థలం కూడా లేదు. అందువల్ల ఈ బస్టాండ్‌ను ఆధునీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఈ మెగా పథకం కోసం రూ.823 కోట్లు ప్రకటించింది. విదేశీస్థాయిలో అత్యాధునిక వసతులతో బ్రాడ్‌వే బస్టాండ్ నిర్మించనున్నట్లు గత అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. ఈ బస్టాండ్ ఏ డిజైన్‌లో నిర్మించాలన్న దానిపై నాలుగు నమూనా చిత్రాలను ప్రజాపనుల శాఖ అధికారులు రూపొందించారు. ప్రభుత్వం వీటిని పరిశీలించి ఎంపిక చేసే డిజైన్ ప్రకారం నూతన బస్టాండ్ రూపుదిద్దుకుంటుంది. ఇందుకోసం సమీపంలో ఉన్న కుర్లగం ప్రభుత్వ భవనాన్ని కూడా కూల్చివేసి ఆ స్థలాన్ని కొత్త బస్టాండ్ కోసం వినియోగిస్తారు. ఈ బస్‌స్టేషన్‌లో వాణిజ్య భవనాలు, హోటళ్ళు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు ఏర్పాటుకానున్నాయి. నిర్మాణం పనులు ప్రారంభించాక ఇక్కడి నుంచి నడిచే బస్సులను మెరీనా బీచ్ సమీపంలోని ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి తాత్కాలికంగా నడుపుతారు. ఇదిలా ఉండగా, అన్నానగర్, వెస్ట్ కేకే నగర్, మందవెల్లి బస్టాండ్లు, డిపోలను కూడా ఆధునీకరిస్తామని అధికారులు తెలిపారు.



పూల ప్రదర్శనకు ముస్తాబైన అన్నా పార్క్

విరబూసిన రోజాలు

● నేటినుంచి ఏర్కాడులో వేసవి ఉత్సవాలు



పూలతో చేసిన సంగీత వాద్య పరికరాలు

ప్యారీస్, మే 21: ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకున్న సేలం జిల్లాలోని ఏర్కాడులో బుధవారం 47వ వేసవి ఉత్సవాలు, పుష్ప ప్రదర్శన ప్రారంభం కానుంది. పుష్ప ప్రదర్శన కోసం ఉద్యానవన శాఖ అధికారులు అన్నా పార్క్‌లో పూలకుండీల్లో ఆరు నెలల క్రితం నాటిన పూల మొక్కలు ప్రస్తుతం విరబూసి సువాసనలు వెదజల్లుతున్నాయి. సందర్శకులను ఆకట్టుకొనేలా 650 రకాలకు చెందిన రోజా పూలు, డబుల్ డిలైట్, శామర్స్‌స్నో, పరఫుల్‌మూన్, మిల్కీవే, సిల్వర్ లినింగ్, డబుల్ మౌంటైన్, గ్లోరి తదితర విదేశీ అరుదైన పూలరకాలు ఈ ప్రదర్శనలో ఆకట్టుకుంటాయి. అంతేకాకుండా సందర్శకులను కట్టిపడేసే జీనియా, డోలియా, సాల్వియా, కార్నేషన్, జఫ్రా, ఫెర్గునియా, డ్రాగన్ పూలను పుష్ప ప్రదర్శన కోసం కుండీల్లో పెంచి సంరక్షిస్తున్నారు. ఈ పూలతో పాటు స్థానికంగా అందుబాటులో ఉండే సూర్యకాంతి, ముద్దబంతి, చామంతి, కనకాంబరం సహా 112 రకాల పూల రకాలు కూడా ప్రదర్శనలో ఏర్పాటుచేశారు. అన్నా పార్క్ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పూలతో స్వాగత ఆర్చీలు, విద్యుత్ స్తంభాలు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు సేలం, ఈరోడ్, మదురై, తిరుచ్చి, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ఏర్కాడుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రకటించారు

పంచాయతీ రాజ్ చట్టం రాజీవ్ చలవే

టీఎస్‌సీసీ ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్యారీస్, మే 21: దేశపౌరుల మధ్య కుల, మత, జాతి, జన్మస్థాన, లింగపరమైన భేదాలు తొలగించి సమానత్వం కల్పించాలన్న దూరదృష్టితో రాజీవ్ గాంధీ వ్యవహరించారని, పంచాయతి రాజ్ చట్టం ఆయన చలువేనని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యదర్శి కె.చిరంజీవి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా అయనావరంలో మంగళవారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్‌కు నివాళులర్పించారు. సీనియర్ నేతలు దామోదరన్, చంద్రమోహన్, ఎస్కే నవాజ్, కౌన్సిలర్ ధనలక్ష్మి శరవణన్, ఐసిఎఫ్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం హక్కులు అందరికీ సమానంగా చేరాలన్న దూరదృష్టితో రాజీవ్ గాంధీ ప్రధానిగా వ్యవహరించిన సమయంలో పంచాయతీ రాజ్ చట్టాన్ని ప్రవేశపెట్టారని, అందువల్ల దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక సంస్థలు వేగంగా అభివృద్ధి చెందాయన్నారు.



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిరంజీవి, దామోదరన్ తదితరులు

నేడు వైకాశి విశాఖ ఉత్సవాలు

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు





తిరుచెందూరు ఆలయం వద్ద గుమికూడిన భక్తులు



సముద్రతీరంలో సేదతీరుతున్న భక్తులు - నోటికి శూలాలు గుచ్చుకుని క్షీర కలశాలతో వస్తున్న భక్తులు

చెన్నై, మే 21 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్యదైవమైన సుబ్రహ్మణ్యస్వామివారు కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో రెండవదైన తిరుచెందూరు ఆలయంలో బుధవారం వైకాశి విశాఖ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి మంగళవారం ఉదయమే తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయానికి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంతం, సముద్రతీరం, బజారు వీధులు భక్తులతో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి అవతరించిన రోజును వైకాశి విశాఖ పేరుతో ఉత్సవాలు జరుపుకుంటున్నారు. ఈ వైకాశి విశాఖ రోజు కుమారస్వామిని దర్శించుకుంటే సకల సంపదలు కలుగుతాయని, ప్రత్యేకించి శత్రువుల బాధలు, రోగాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైకాశి విశాఖ పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పసుపు దుస్తులు ధరించి నోటికి శూలాలు గుచ్చుకుని, కావళ్లు మోస్తూ తిరుచెందూరు చేరుకుంటున్నారు. బుధవారం వేకువజామునే స్వామివారిని దర్శించుకోవాలనే ఆరాటంతో భక్తులు ఒక రోజు ముందుగానే ఆ దివ్య క్షేత్రానికి పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళారు. పూలకావళ్లు, క్షీర కావళ్లు మోసుకొచ్చిన భక్తులంతా స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. వైకాశి విశాఖ సందర్భంగా ఆలయంలో మంగళవారం వేకువజాము 3.30 గంటలకు విశ్వరూపదర్శనం, ఐదు గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, ఉదయం 10.30 గంటలకు ఉచ్చికాల అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక దీపారాధన చేశారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక అభిషేకం జరిగింది. ఇక బుధవారం స్వామివారి అవతార దినాన్ని పురస్కరించుకుని వైకాశి విశాఖ వేడుకల్లో భాగంగా అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు ఆలయాన్ని తెరవనున్నారు. విశ్వరూప దర్శనం, దీపారాధన, నాలుగు గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, ఉదయం 10.30 గంటలకు ఉచ్చికాల అభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల తర్వాత స్వామివారు జయంతినాథుడు వసంత మండపానికి వేంచేసి మునికుమారులకు శాపవిమోచనం కలిగిస్తారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ దూరవిద్య విభాగం- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు (రెండు నెలలు). గ్రామీణ రైతులు, మహిళలు, యువత దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై నుంచి సెప్టెంబరు వరకు శిక్షణ తరగతులు ఉంటాయి.

కోర్సులు: మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల పెంపకం.

అర్హత: వయోపరిమితి నిబంధనలు లేవు. తెలుగు చదవడం, రాయడం తెలిసి ఉం డాలి. కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్ ఉండాలి.

శిక్షణ: రిజిస్ట్రేషన్ చేసుకొన్నవారికి పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇస్తారు. వారానికి ఒక రోజు చొప్పున మొత్తం ఏడు ఆన్‌లైన్ తరగతులు ఉంటాయి. ఒక్కో తరగతి సమయం 2 గంటలు. ఇందులో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు నిర్వహిస్తారు. వీటికి అభ్యర్థుల అటెండెన్స్ తప్పనిసరి. అభ్యర్థి ఎంపిక చేసుకొన్న స్టడీ సెంటర్లో ప్రాక్టికల్ తరగతులు ఉంటాయి. కోర్సు పూర్తయిన తరవాత పరీక్ష ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **చిరునామా:** డీన్(వ్యవసాయం) కార్యాలయం, పరిపాలన భవనం, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు- 522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి
DIKSUCHI

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.cbip.org

SCHOLARSHIP ALERT

ICRO Amrit Internship Programme

Description: ICRO Amrit Internship Programme 2024 is a joint initiative of the Indian Potash Limited (IPL) and the National Productivity Council (NPC) under the Ministry of Commerce and Industry, Government of India for Class 12 passed, final-year graduation students, graduates, and diploma holders.

Eligibility: Open for Indian nationals aged between 18-45 years. Applicants must be Class 12 passed, final-year graduation students, graduates, or diploma holders with a a valid Aadhaar card.

Prizes & Rewards: A monthly stipend of 6,000 and a certificate of completion

Last Date to Apply: 01-10-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/ICRA1



NextGen Edu Scholarship

Description: Buddy4Study in collaboration with EY Global Delivery Services is inviting applications through NextGen Edu Scholarship 2024-25 - a social impact initiative. Class 11 students enrolled in private or government schools across India are eligible to receive financial support for their studies.

Eligibility: Students studying in Class 11 at any private/government school across India are eligible to apply. Applicants must have secured a minimum of 60% in their Class 10. They must have an annual family income up to INR 3 lakh from all sources.

Prizes & Rewards: Scholarship of INR 15,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/EYGDS1

UK-India TOEFL Scholarship

Description: UK-India TOEFL Scholarship 2024 is a program that supports Indian students pursuing full-time UG/PG studies in the UK. This opportunity is offered by the Educational Testing Service (ETS), in collaboration with the National Indian Students and Alumni Union (NISAU).

Eligibility: Open to Indian citizens applying to undergraduate or postgraduate courses at UK universities. Applicants must have taken the TOEFL iBT test between April 1 and July 15, 2024, with a minimum score of 75.

Prizes & Rewards: A one-time scholarship of 2,50,000 each for 10 students

Last Date to Apply: 15-07-2024

Application mode: Online Only

Short Url: www.b4s.in/aj/TOEF1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Wn7hfeQలో చదవండి.





కేన్స్‌లో కన్నప్ప సందడి

విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. దాంతో ప్రమోషన్ వర్క్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లిన కన్నప్ప టీమ్ అక్కడ సందడి చేసింది. నిర్మాత మోహన్‌బాబు, విష్ణు, ప్రభుదేవా ఈ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. అక్కడ 'కన్నప్ప' టీజర్‌ను అందరికీ ప్రదర్శించారు. ఈ టీజర్ చూసి అక్కడి ప్రేక్షకులు ముగ్ధులయ్యారని విష్ణు తెలిపారు. ఇంటర్నేషనల్ డిస్ట్రిబ్యూటర్స్, కేన్స్ ఫెస్టివల్‌కు వచ్చిన ఇండియన్స్ టీజర్ బాగుందని అభినందించారు. ఆ రెస్పాన్స్ చూసిన తర్వాత నాకు కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు.' అని ఆయన తెలిపారు. జూన్ 13న ఇండియా వైడ్‌గా 'కన్నప్ప' టీజర్ విడుదల చేస్తారు. దానికంటే ముందు ఈ నెల 30న తెలుగులో కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేస్తామని విష్ణు వెల్లడించారు. 'మా కన్నప్పను సోషల్ మీడియాలో మొదటి నుంచి ప్రోత్సహిస్తున్న కొంతమంది సెలెక్టెడ్ ఆడియన్స్‌కు ఈ టీజర్ చూపిస్తాం' అని అన్నారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు.


కొత్త తేదీన హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'హరోం హర'. మరోసారి ఈ చిత్రం విడుదల వాయిదా పడింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెలాఖరున ఈ చిత్రం విడుదలవ్వాలి. అయితే మంగళవారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూన్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో వెనుక అగ్ని జ్వాలలు చెలరేగుతుండగా, భుజంపై తుపాకీతో నడిచొస్తున్న సుధీర్‌బాబు లుక్ శక్తిమంతంగా ఉంది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. మాళవిక శర్మ కథానాయిక. సునీల్ కీలక పాత్ర పోషించారు. సుమంత్ జి. నాయుడు నిర్మాత. సంగీతం: చైతన్ భరద్వాజ్. సినిమాటోగ్రఫీ: అరవింద్ విశ్వనాథన్.

ఖురేషి అబ్రమ్.. అదిరే లుక్!

మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ 'లూసిఫర్'కు సీక్వెల్ వస్తోంది. 'ఎల్ 2 ఎంపురాన్' పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఖురేషి అబ్రమ్ పాత్రను పోషిస్తున్నారు. స్టీఫెన్ నడుంపల్లి ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడనే విషయాన్ని సీక్వెల్‌లో చూపించబోతున్నారు. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఆ పాత్ర లుక్ విడుదల చేశారు. స్టయిలిష్‌గా నడుచుకుంటూ వస్తున్న మోహన్‌లాల్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు. నటుడు, ఈ చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమార్ 'హ్యాపీ బర్త్ డే లాలెట్టా' అంటూ సోషల్ మీడియా వేదికగా మోహన్‌లాల్‌కు



అభినందనలు తెలిపారు. మరో విషయం ఏమిటంటే లైకా ప్రొడక్షన్స్ సంస్థ 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రంతో మలయాళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతోంది. లడఖ్, చెన్నై, కొట్టాయం, అమెరికా, లండన్ ప్రాంతాల్లో 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం షూటింగ్ జరిగింది. ప్రస్తుతం తిరువనంతపురంలో చిత్రీకరణ జరుగుతోంది. ఆ తర్వాత గుజరాత్, దుబాయ్‌లో కూడా షూటింగ్ చేయాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది భారీ లెవల్‌లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాతలు సుభాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్ చెప్పారు.

పారితోషికం రూ.250 కోట్లా?



బాలీవుడ్‌లో ఓ వెలుగు వెలిగి, పెళ్లి చేసుకుని అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక నటనకు గుడ్‌బై చెప్పకుండా హాలీవుడ్ సినిమాలు, సిరీస్‌లు చేస్తూ బిజీగానే ఉన్నారు. అమెజాన్ ప్రైమ్ కోసం ఆమె గత ఏడాది 'సెటడెల్' సిరీస్‌లో నటించారు. దీనికి ఇండియన్ వెర్షన్‌లో ప్రియాంక పాత్రను సమంత చేశారు. 'సిటాడెల్'లో నటించినందుకు ప్రియాంక తీసుకున్న పారితోషికం ఎంతో తెలుసా? దాదాపు రూ. 250 కోట్లు. బాపురే.. అనుకోకండి. ఇది నిజమే. ఇటీవల వచ్చిన సంజయ్ లీలా భన్సాలి 'హీరామండీ' కోసం నెట్‌ఫ్లిక్స్ చెల్లించిన మొత్తం కంటే ప్రియాంక తీసుకున్న పారితోషికమే ఎక్కువట. అంటే ఇప్పుడు ఓటీటీలో హయ్యెస్ట్ పెయిడ్ ఆర్టిస్ట్ ప్రియాంక నే అన్నమాట. ఆమె పనే బాగుంది కదూ!

డర్టీఫెలోకు ఛాయిస్ లేదు



శాంతి చంద్ర, దీపిక సింగ్, సిమ్రిత్, నికిష రంగ్‌వాలా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. శాంతిబాబు నిర్మించారు. ఈ నెల 24న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాకు 'డర్టీఫెలో' అనే టైటిల్ ఎందుకు పెట్టారు అని శాంతిచంద్రను అడిగాను. 'ఈ కథకు ఆ టైటిల్ తప్ప మరో చాయిస్ లేదని ఆయన చెప్పారు. మంచి కథతో వస్తున్న చిత్రమిది' అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో కావాలనుకున్నాను. అది 'మంత్ర' చిత్రంతో నెరవేరింది. ఆ తర్వాత బిజినెస్ పనులతో గ్యాప్ వచ్చింది. మళ్లీ 'డర్టీఫెలో' కథ నచ్చడంతో నిర్మాణ బాధ్యతలు తీసుకున్నాను. ఎమోషన్, యాక్షన్, రొమాన్స్, ఫ్యామిలీ డ్రామా లాంటి అన్ని హంగులు ఉన్న చిత్రమిది' అన్నారు. అడారి మూర్తి సాయి మాట్లాడుతూ 'సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న సినిమాలను బతికించండి. చిత్రబృందం అంతా ఒకే కుటుంబంలా కలసి పనిచేశాం. కథా బలమున్న చిత్రమిది' అన్నారు.



జూన్‌లో 'ఓ.సి' వినోదం

హరీశ్ బొంపెల్లి, మాన్య సలాడి జంటగా తెరకెక్కిన చిత్రం 'ఓ.సి'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌కు హరీశ్‌బొంపెల్లి దర్శకుడు. బీవీఎస్ నిర్మాత. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. జూన్ 7న 'ఓసి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన కొందరు యువకుల జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఆసక్తి కరంగా ఉంటుంది. నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు 'ఓ.సి' అనే టైటిల్ పెట్టడానికి ఉన్న కారణం సినిమా చూస్తే తెలుస్తుంది' అని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి వంశీ ఎస్, అక్షర్ బ్యాండ్ సంగీతం అందించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/y8pE852 లో చదవండి.

